క్లుప్తంగా

ఆత్మీయ సన్మానం



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ అనుషదేవి,జెడ్పీటీసీ బాలయ్యపడాల్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి: చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో ఊర్మిళను ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్‌లు ఘనంగా సన్మానించారు., మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి తొలిసారిగా వచ్చిన చైర్‌పర్సన్‌ను మండల ప్రజాప్రతినిధులు దుశ్శాలువాతో శుక్రవారం సన్మానించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, తహసీల్దార్ ఆనందరావు, ఏపీవో రాజు, ఏపీఎం శ్రీనివాసరావు, ఏవో మధుసూదనరావు, వైస్ ఎంపీపీలు శారద, వెంగళరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



తాగునీటి ట్యాంకు పనులకు పూజలు చేస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కొళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. ఆయన శుక్రవారం మంపలో కూటమి నాయకులు ప్రసాద్‌తో కలిసి రూ.20.80 లక్షలతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ట్యాంకు పూర్తయితే మంపకు తాగునీరు సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో జెజెఎం ద్వారా తాగునీరు అందుతుందన్నారు. సర్పంచ్ త్రినాథ్‌పడాల్, మాజీ ఎంపీటీసీ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధిపై అవగాహన



అడ్డతీగలలో సర్పంచ్‌లకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

అడ్డతీగల: గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలని అడ్డతీగల ఎంపీడీవో ఏ.వి.వి.కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీల ఆదాయ పెంపు అంశంపై సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు ఏఏ అంశాల ద్వారా మెరుగుపై సర్పంచ్‌లకు సూచించామన్నారు. క్రమం తప్పకుండా పన్నులు చెల్లించడం ద్వారా మౌలిక అవసరాలు తీరతాయన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో శిక్షణలో పలు అంశాలను రెండు రోజుల శిక్షణలో వివరించామన్నారు. పంచాయతీ సాధికారత సాధించడానికి సొంత నిధులు పెంపు ఉపయోగపడుతుందని పలువురు సర్పంచ్‌లు అభిప్రాయపడ్డారన్నారు.

సమస్యలపై వినతి



సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలికి వినతి పత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, నేతలు

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ శానిటేషన్ కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ గీతాంజలికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం అందించాలని, ఏరియర్స్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈశ్వరి, భీమరాజు, సుబ్బలమ్మ, గాసన్న తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం

చోడవరం: బాలిక అదృశ్యం కేసును చోడవరం పోలీసులు వెంటనే ఛేదించారు. ఆమెను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. అనంతగిరి మండలానికి చెందిన బాలిక చోడవరం పట్టణంలోని ఎస్టీ కాలేజీ హాస్టల్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. సెలవులు కావడంతో గురువారం సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికని బయలు దేరింది. అప్పటి నుంచి ఆ బాలిక కనిపించకపోవడంతో తండ్రి చిక్కయ్య చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ అప్పలరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ నాగకార్తీక్ తన సిబ్బందితో బాలిక ఆచూకీ కోసం వెతికారు. బాలిక మాకవరపాలెం వద్ద కనిపించడంతో వెంటనే పోలీసులు పట్టుకొని చోడవరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వివరాలు తెలుసుకొని తహసీల్దార్ రామారావు సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు శుక్రవారం అప్పగించినట్టు ఎస్‌ఐ నాగకార్తీక్ చెప్పారు.

- కమ్మరితోటలో తాగునీటి **ఎద్దడి**
- కలుషిత నీరే శరణ్యం
- దారకొండ- చిన్న గంగవరం **మధ్యలో** కొట్టుకుపోయిన వంతెన
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

వెతలు తీరేదెన్నడో?



కొట్టుకుపోయిన చిన్న గంగవరం వంతెన



కమ్మరితోటలో ఊటగెడ్డ నుంచి నీటిని సేకరిస్తున్న గ్రామస్తులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం **దారకొండ** పంచాయతీ కమ్మరితోట గ్రామంలో **తాగునీటి ఎద్దడి** ఏర్పడింది. గ్రామానికి కిలోమీటరు దూరంలో కొండ ప్రాంతాల్లో ఉన్న ఊట గెడ్డ నుంచి నీటిని పైపుల ద్వారా గత కొద్ది సంవత్సరాలుగా సరఫరా జరిగేది. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఊటగెడ్డ మొత్తం పెద్ద పెద్ద బండరాళ్లతో మూసుకుపోయింది.దీంతో ఊటగెడ్డ మొత్తం పాడైపోయి తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కమ్మరితోట గ్రామంలో సుమారు 110 కుటుంబాలు నివసిస్తున్నాయి. 2010లో సీఆర్పీఎఫ్ బృందం వీధిలో తాగునీటి కోసం బోరింగ్ వేయించి కొళాయి నిర్మించారు. విద్యుత్ సరఫరా ఉంటేనే తాగునీటి అందే పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా లేని సమయాల్లో రోజుల తరబడి తాగునీరందక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

అయితే ఆ నీరు కింద వీధికి మాత్రమే సరిపోతుందని ఎగువ ప్రాంతాలకు చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ముందు గ్రావిటీ నీరు పుష్కలంగా వచ్చేదని ప్రస్తుతం ఊటగెడ్డ ప్రాంతమంతా రాళ్లతో కప్పబడి తాగునీటి సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఊట గెడ్డ ఉందని అక్కడి నుంచి గ్రామానికి గ్రావిటీ కనెక్షన్ ఇవ్వాలని లేకుంటే తీవ్ర నీటి ఎద్దడికి గురవుతారని ఎండాకాలం ఈ సమస్య అధికారులు తక్షణమే గుర్తించి గ్రామానికి మంచినీటి సదుపాయాన్ని కల్పించాలని లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఎదుర్కొంటుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వంతెన కష్టాలు ఇంకెన్నాళ్లు?

గూడెం కొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ నుంచి చిన్న గంగవరం మీదుగా ఒడిశా వెళ్లే దారిలో ఉన్న వంతెన కష్టాలు ఆ ప్రాంత గిరిజనులకు తీరడం లేదు. గిరిజన గ్రామాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ వంతెన చూస్తే తెలుస్తుంది. తుపాను వచ్చి కొట్టుకుపోయి ఏడాదవుతున్న కనీసం సంబంధిత శాఖ అధికారులు దీన్ని నిర్మించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. దారకొండ నుంచి చిన్న గంగవరం గ్రామం మీదుగా ఒడిశా వెళ్లే ప్రధాన రహదారిలో గంగవరం వంతెనను 2014లో రూ.40 లక్షలతో నిర్మించారు. గత సెప్టెంబర్ నెలలో భారీ వర్షానికి ఈ వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఈ వంతెనను నిర్మించాలని స్థానికులు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. అయినా నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఏడాది కావస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. తాత్కాలికంగా నిర్మించిన వంతెన కూడా గత ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు సరిహద్దు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులు మాట్లాడుతు వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



బండరాళ్లతో కూరుకుపోయిన ఊటగెడ్డ



పాడేరులోని ఓ వీధిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

వీధుల్లో కుక్కల స్వైర విహారం

పాడేరు రూరల్: పట్టణంలోని పలు వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తుండడంతో స్థానికులు రాంబాబు, కుమార్, బాలకృష్ణ తదితరులు భయపడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. వాహనచోదకులను వెంబడిస్తున్నాయని చెబుతున్నారు. చీకటి పడితే రహదారులపై గుంపులుగా కుక్కలు తిష్టవేస్తున్నాయంటున్నారు.కుక్కకాటు బాధితులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాడేరు రూరల్: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరరావునాయుడు తెలిపారు. మండలంలో మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని చింతలవీధి సచివాలయంలో శుక్రవారం స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ సాయిశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రభాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ వరహాలక్ష్మి, సర్పంచ్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చింతలవీధిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరరావునాయుడు

ఆరోగ్య భద్రత పాటించాలి

ఎటపాక: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ఆకుటుంబానికి రక్ష అని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి అన్నారు. పురుషోత్తపట్నం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను నెల్లిపాక పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్ వివరించారు.ఎంపీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పోషక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని దీనిపై తల్లులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సర్పంచ్ ఆదినారాయణ, డీడీవో శ్రీదేవి, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం స్వస్త్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్‌కె మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందజీ మహారాజ్ తెలిపారు. ఇందులో భాగంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోని బహుళ విభాగాల పరిశోధన కేంద్రం, కాకినాడ జీజీహెచ్ వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఏజెన్సీలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



ఎటపాకలోని సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి

డుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ పీహెచ్‌సీలో స్వస్త్ నారీసశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 104 భవ్య ఆరోగ్య సేవా జిల్లా మేనేజర్ పి.నరేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 104 సేవలపై ఆరా తీశారు. శివారు గ్రామాల్లోనూ సేవలందించడమే లక్ష్యమన్నారు. వైద్యాధికారి కుమార్‌రత్న, హెచ్‌వి జాహ్నవి, డీఈవో శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గంగవరం: మండలంలోని జడేరు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, దీంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, దీంతో తల్లీ,బిడ్డకు సురక్షితమన్నారు. ఐసిడిఎస్ సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.మాజీ ఎంపీపీ రాంబాబు, సూపర్‌వైజర్ కుమారి పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, చింతలపూడిలోని శుక్రవారం జరిగిన పోషణ్ మహా కార్యక్రమాల్లో సీడీపీవో ఎల్.దేవమణి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. వైద్యులు నాయక్, సీహెచ్‌వో ప్రశాంత్, సూపర్‌వైజర్లు సత్యవతి, రామలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు

గ్రామాల్లో సీఆర్పీలకు శిక్షణ

చింతపల్లి: మండలంలో ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధంగా ప్రతి ఒక్కరినీ అవగాహన పర్చాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు.శుక్రవారం చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల కార్యదర్శులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో అన్ని గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన తడి పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం సీఆర్పీలు విధిగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, పరిశుభ్రతపై క్లాప్ మిత్రలకు సూచనలు ఇవ్వాలన్నారు.

రంపచోడవరం: వ్యర్థాలను సరైన పద్ధతిలో నిర్వహణ ద్వారా ఎరువుగా మార్చడంతో మొక్కలకు మంచి పోషక ఎరువులను తయారు చేయవచ్చని రంపచోడవరం డిప్యూటీ ఎంపీడీవో వై.రాజు అన్నారు. మండలంలోని ఐ.పోలవరం గ్రామ పంచాయతీలో శుక్రవారం లోకల్ ట్రెనింగ్ సెంటర్‌లో గంగవరం, రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నానికి చెందిన సీఆర్‌పీలకు ఘన వ్యర్థాల నిర్వహణ, గృహస్థాయి వ్యర్థాల వర్గీకరణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో రాజు మాట్లాడుతూ వెయ్యి కుటుంబాలకు ఒక సీఆర్‌పీని నియమించినట్టు చెప్పారు. సిబ్బంది తమ్మన్నదొర, కార్యదర్శి వినోలి, సుబ్బారావు పాల్గొన్నారు.



రంపచోడవరంలోని శిక్షణలో అధికారులతో సీఆర్పీలు

అడ్డతీగల: చెత్త నుంచి సంపద సృష్టికి అనుసరించవలసిన విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలని కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ)లకు డిప్యూటీ ఎంపీడీవో కె.రాంబాబు అన్నారు. సీఆర్పీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని అడ్డతీగలలో శుక్రవారం నిర్వహించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్త విడి విడిగా సేకరించడంలో అలసత్వం వహించకుండా ఉండాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ సి.మోహన్ అన్నారు. సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



ఒనకఢిల్లీలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్ఎఫ్ జవాన్లు, స్థానికులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఒనకఢిల్లీలో బీఎస్ఎఫ్ జవాన్లు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.బీఎస్ఎఫ్ జవాన్లు ఒనకఢిల్లీలో వీధులను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను దూరంగా తీసుకొని వెళ్లి కాల్చివేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరారు. బీఎస్ఎఫ్ బలగాల కార్యక్రమానికి స్థానిక జెహోవా జైరిన్ యువజన సంఘం యువకులు సైతం మద్దతూ తెలిపారు ఈ సందర్భంగా 180 బెటాలియన్ బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేందర్ రాణా మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

చింతూరు: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ జేఏసీ కేంద్ర కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఆదివాసీలు సాగిస్తున్న ఉద్యమానికి తమ జేఏసీ మద్దతుగా ఉంటుందన్నారు. సీనియర్ నాయకుడు ఆత్రం నవీన్ మాట్లాడుతూ గిరిజనేతరులైన లంబాడదీలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. నరేష్, సాయి, దేశయ్య, సాయిబాబు, రామకృష్ణ, రాముడు, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ట్రెక్కింగ్



బొర్రా గుహలను సందర్శిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

అరకులోయటౌన్: అరకులోయ పరిసర ప్రాంతాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. అరకులోయలోని గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, బొర్రా గుహలు, గాలికొండ బాక్సైట్ కొండలను వారు శుక్రవారం సందర్శించారు. సుంకరమెట్ట , గాలికొండ పరిసరాల్లో ట్రెక్కింగ్ నిర్వహించారు. గాలికొండపై ఎన్‌సీసీ జెండా ఎగురవేశారు. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్ - 2025 ఈనెల 23 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఉన్న 525 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, అసోషియేట్ ఎన్‌సీసీ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

రంపచోడవరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలను రంపచోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకుడు పండా సిద్దార్థదొర, నాయకులు తీవ్రంగా ఖండించారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బాలకృష్ణ తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా కూటమి నాయకులు వారి సమూహం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తక్షణమే బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సినీ పరిశ్రమ సంక్షేమ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు.

రహదారి సమస్యపై కలెక్టర్‌కు వినతి



పాడేరులో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయతీ కొమరాపురం నుంచి లోదొడ్డి పంచాయతీ పాకవెల్తి వరకు గల 20 కిలోమీటర్ల రహదారికి మరమ్మతు చేయాలని కోరుతూ శుక్రవారం పాడేరులో జరిగిన గ్రీవెన్స్‌లో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఈ రహదారి పెద్ద పెద్ద గోతులతో ఉందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే రోడ్ మరమ్మతుకు ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చినట్టు వాతంగి సర్పంచ్ భీంరెడ్డి శుభలక్ష్మి, ఉప సర్పంచ్ రాళ్ళగడ్డ అర్జున్, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ జుర్రా జాన్‌బాబు విలేకరులకు తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు జోగారావు, వెంకటేష్ , ఏవో మధుసూదనరావు

చింతపల్లి: గిరిజన రైతాంగం వరి పంటలో ఆశించే తెగుళ్ల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు జోగారావు ,వెంకటేష్‌లు తెలిపారు. మండలంలో కొమ్మంగి పంచాయతీ పరిధిలో గల ముల్లుమెట్ట, బురిసింగి, కొత్తూరు, పెదబరడ పంచాయతీల్లో మడిగుంట గ్రామాల్లో వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో వరి పంటకు అగ్గి తెగులు, ఆకుముడత పురుగుతో పాటు పొటాష్ లోపం వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఆకుముడత పురుగు నివారణకు క్లోరిపైరిపోస్ 2.5 మి.లీ టర్లు నీటికి(ఎకరానికి 500 మి.లీ) పిచికారీ చేయాలని సూచించారు. పంటలో ముదురు ఆకులు ఎరుపు రంగులోకి మారినట్లయితే పొటాష్ లోపంగా గుర్తించి ఎంఓపీ (10-12 కిలోలు ఎకరానికి)వేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎక్కువగా తెగులు వ్యాప్తి చెందకుండా యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ విగ్నేష్ రైతులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ముంచంగిపుట్టు: జీసీసీ ద్వారా 50 మంది గిరిజన కాఫీ రైతులకు రుణాలు మంజూరుచేసినట్టు జీసీసీ మేనేజర్ పాంగి కుమారస్వామి అన్నారు. స్థానిక జీసీసీ గోదామును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. స్టాకును పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కుమారస్వామి మాట్లాడుతూ రేషన్ సరకులు సకాలంలో డిపోలకు సరఫరా చేయడం, రేషన్‌దారులకు అందించడం జరుగుతుందని, గిరిజన సహకార సంస్థ ద్వారా కించాయిపుట్టు, జర్రెల, కరిముఖిపుట్టు, ఏనుగురాయి, పెదగూడ, కిలగాడ, దొడిపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాలకు చెందిన 50 మంది కాఫీ రైతులకు రూ.3.25లక్షల రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అయిందని, రుణాలు పొందిన కాఫీ రైతులు వారి పంటను జీసీసీకి మాత్రమే విక్రయించాలని ఆయన కోరారు. జీసీసీ గోదాము సూపరింటెండెంట్ మొశ్యా రామ్మూర్తి, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.



గోదాములో రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ మేనేజర్ కుమారస్వామి

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు: జెడ్పీ నిధులతో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ అరబీరు జగబంధు అన్నారు. మండలంలో గల బరడ పంచాయతీ కేంద్రం, అంటబొంగులో రూ.10 లక్షలతో, లక్ష్మీపురం పంచాయతీ సంగంవలసలో రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు శంకుస్థాపనలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ జగబంధు మాట్లాడుతూ జెడ్పీ నిధులతో ఎన్నడూ జరగని పనులు గిరిజన గ్రామాల్లో జరుగుతున్నాయని, ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు, తాగునీటి పథకాలు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతోనే సాధ్యమవుతున్నాయన్నారు.



బరడలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ నబ్బో, నేతలు

నూతన డ్రైనేజీలకు నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆయా గ్రామాలకు గిరిజనులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సర్పంచులు పార్వతి, నీలకంఠం, ఎంపీటీసీ నబ్బో, వైఎస్సార్‌సీపీ నేతలు మూర్తి, తిరుపతి, సన్యాసిరావు, రాజారావు, భగత్‌రాం, సాధురాం, బలరాజు, విక్రమ్, కామేష్‌లు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్‌తో సతమతం

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సమీపంలోని బురద గెడ్డ వద్ద శుక్రవారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వంతెన పక్కన రహదారి కోతకు సంవత్సరాలు కావస్తున్నా ఆ గొయ్యిని పూడ్చకపోవడంతో గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. దసరా పండుగతో పాటు వారపు సంత, పర్యాటక వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీ ఎక్కువ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఈ మార్గంలో ఇద్దరు యువకులు గొయ్యి వద్ద ద్విచక్రవాహనంతో పడి మృతి చెందినట్టు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోయ్యిని పూడ్చి మరిన్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాఫిక్ జామ్‌తో రాకపోకలకు అంతరాయం